షాక్ కొడుతున్న బకాయిలు

- ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోతున్న విద్యుత్ బిల్లులు
- ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో రూ.13.94 కోట్ల బకాయి

ఆలూరు రూరల్: విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన బకాయిలు ప్రభుత్వ కార్యాలయాల అధికారులు సకాలంలో చెల్లించకపోవడంతో విద్యుత్ బకాయిలు పేరుకుపోయి షాక్ కొడుతున్నాయి. ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో పరిధిలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద మండలాలు ఉన్నాయి. గ్రామీణ నీటి సరఫరా పరిధిలో ఉన్న వ్యాటర్ పంప్ హౌస్‌లు, ఎంపీడీఓ ,తహసీల్దార్, ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యాశాఖ, సాంఘీక సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ తదితర శాఖలు ఉన్నాయి. వీటి బకాయిలు రూ.13.94 కోట్లకు పేరుకుపోయాయి. ప్రభుత్వం ఆయా శాఖలకు విద్యుత్ బిల్లులు ఇస్తున్నా కార్యాలయ అధికారులు సకాంలో చెల్లించకపోవడంతో ప్రతి నెలా బకాయిలు పెరిగిపోతున్నాయి. దీంతో విద్యుత్ శాఖ అధికారులు బకాయి వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. ప్రధానంగా ఆలూరు సబ్ డివిజన్‌లో ప్రభుత్వ కార్యాలయాల బకాయిలే అత్యధికంగా ఉండడం గమనార్హం. విద్యుత్ అధికారులు కూడా తోటి ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులే కావడంతో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. విద్యుత్ కట్ చేస్తే అక్కడ పనిచేసే సిబ్బందితో పాటు ఆ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడతారనే మానవతా దృక్పదంతో ఆలోచిస్తున్నారు. వీటితో పాటు ఆలూరులో ప్రైవేటు చిన్న పరిశ్రమలు, గృహాలు, వ్యవసాయ విద్యుత్ బకాయిలు కూడా పేరుకుపోయి ఉన్నాయి. వీటి వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.



విద్యుత్ బకాయి ఉన్న ఆలూరు తహసీల్దార్ కార్యాలయం

ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ప్రధాన శాఖల బకాయిలు ఇలా

గ్రామీణ తాగునీటి సరఫరా పంపు హౌస్‌లు	:	రూ. 12.14 కోట్లు
ప్రభుత్వ ఆస్పత్రులు	:	రూ. 31.44 లక్షలు
మండల అభివృద్ధి కార్యాలయాలు	:	రూ. 43.77 లక్షలు
విద్యాశాఖ	:	రూ. 32.72 లక్షలు
తహసీల్దార్ కార్యాలయాలు	:	రూ. 16.01 లక్షలు
గిరిజన సంక్షేమ పాఠశాలలు	:	రూ. 14.23 లక్షలు
పంచాయతీ రాజ్ శాఖ	:	రూ. 11.14 లక్షలు
మాతా శిశు సంక్షేమ శాఖ	:	రూ. 08.94 లక్షలు

టీబీ డ్యామ్‌కు జలకళ

- పెరుగుతున్న ఇన్‌ఫ్లో
- ఎగువన ఉన్న గాజనూరు జలాశయం గేట్లు ఎత్తివేత
- శివమొగ్గ జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు
- టీబీ డ్యామ్‌లో 6 టీఎంసీల నీరు



హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్దనున్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. శివమొగ్గ జిల్లాలో కొద్ది రోజులుగా ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో టీబీ డ్యాం ఎగువన ఉన్న గాజనూరు జలాశయం (అప్పర్ తుంగ ప్రాజెక్ట్)లో నీటి నిల్వ గరిష్ట మట్టానికి చేరింది. దీంతో శనివారం అక్కడి ఇంజనీర్లు కొన్ని గేట్లను ఎత్తి సుమారు 10 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆ నీరు దిగువన ఉన్న తుంగభద్ర డ్యాం వైపుకు వస్తున్నాయి. శనివారం రాత్రి లేదా ఆదివారం ఉదయానికి డ్యాంకు పూర్తిస్థాయిలో నీరు చేరే అవకాశాలున్నట్లు బోర్డు అధికార వర్గాలు తెలిపాయి. ఎగువున ఉన్న చిక్ మంగళూరు, కొప్పి, శివమొగ్గ, శృంగేరి, వరనాడు, మలేనాడు, తీర్థనహళ్లీ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అక్కడి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. తుంగ డ్యాం నుంచి నీటిని విడుదల చేయడంతో కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రాలకు సంబంధించి దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగిరిస్తున్నాయి. గతేడాది ఈ సమయానికి కేవలం 3 టీఎంసీలు ఉండగా నేడు 6 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంది. కొద్ది రోజులుగా డ్యాంకు నీటి ప్రవాహం మొదలు కాకపోడంతో దిగాలు చెందిన రైతులు తుంగా నుంచి నీరు విడుదలవుతుండడంతో వరుణుడు కరుణించి రిజర్వాయర్ త్వరగా నిండాలని ఆశగా ఎదురు చూస్తున్నారు.

టీబీ డ్యాంలో నీటి నిల్వ

తుంగభద్ర రిజర్వాయర్ పూర్తిమట్టం 1633 అడుగులకు గాను 1581.56 అడుగులు ఉంది. నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్‌కు ఇన్‌ఫ్లో 1,819 క్యూసెక్కులుండగా అవుట్‌ఫ్లో 297 క్యూసెక్కులుంది. గతేడాది ఇదే సమయానికి 1577.80 అడుగులతో 3.493 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండేది.

క్లుప్తంగా

సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ

చిప్పగిరి: సచివాలయ సిబ్బంది ద్వారా జూలై 1న లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ బరెన్ సాహెబ్ తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సచివాలయంలోని సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పింఛన్లు అందజేయనున్నామని చెప్పారు. మండలంలో వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు లబ్ధిదారులు 3,551 మంది ఉన్నట్లు వెల్లడించారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సూర్య శేఖర్ రెడ్డి శనివారం ప్రకటనలో వెల్లడించారు. జూలై 24వ తేదిలోగా www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 25వ తేదీ దరఖాస్తు చేసుకున్న ఫారంతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. జూలై 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అడ్మిషన్ కోసం కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పదోతరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో వరుణయాగ పూజలు


దేవరగట్టులో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి సన్నిధిలో వరుణయాగ పూజల్లో భాగంగా శనివారం హోమ పూజలు, అభిషేకాలు, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. కాగా ఈ పూజలు ఆదివారంతో ముగుస్తాయి. భక్తులకు అన్నదాన, తీర్థ ప్రసాదాల పంపిణీ చేపట్టనున్నారు.

నేడు హాలహర్వి ఎంపీడీఓ పదవీ విరమణ

హాలహర్వి: స్థానిక ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆంథోని ఆదివారం పదవీ విరమణ చేయనున్నారు. జూలై 2వ తేదీ ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పదవీ విరమణ సభ నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జి.నాసరరెడ్డి, డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఉప కార్యనిర్వహణాధికారి ఈవీ సుబ్బారెడ్డి, కర్నూలు హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి తదితరులు హాజరుకానున్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

మద్దికెర : జూలై 1వ తేదీ సామాజిక పింఛన్లు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ అలివేలమ్మ శనివారం తెలిపారు. మండలంలో 4,840 మంది లబ్ధిదారులు ఉన్నారని అందుకు సంబంధించి రూ. 3,27,22,000 ఆయా సచివాలయ కార్యదర్శులకు అందించడం జరిగిందన్నారు. లబ్ధిదారులకు జూలై నెలకు సంబంధించి రూ.4 వేలు, ఏప్రిల్, మే, జూన్ నెలలకు పెంచిన పింఛన్ నెలకు వెయ్యి చొప్పున మొత్తం రూ.7 వేలు అందజేస్తారని పేర్కొన్నారు.

విద్యార్థులకు అందని పాఠ్య పుస్తకాలు

దేవనకొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 7వ తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందలేదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు బోయ మునిస్వామి అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో విద్యార్థులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మ్యాథ్స్, సోషియల్, ఇంగ్లిష్, తెలుగు పాఠ్య పుస్తకాలు అందలేదని విద్యార్థులు తెలిపారు. తరగతులు ప్రారంభమై పది రోజులు కావొస్తున్నా పాఠ్య పుస్తకాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

విద్యార్థులకు ప్రయాణ కష్టాలు


సుళువాయి మార్గంలో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

హొళగుంద: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాలకు వస్తున్న సుళువాయి, సమ్మతగేరి, పెద్దహ్యాట, హాలహర్వీ మండలం విరుపాపురం తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులకు ప్రయాణ తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రానికి రావాలంటే ప్రతి రోజు 13 కి.మీ ఆటోలో వచ్చి వెళ్తున్నారు. ఆలూరు-సుళువాయి, కోగిలతోట మార్గంలో అదనపు బస్సులు లేకపోవడం, విద్యార్థుల పాఠశాల సమయానికి బస్సులు నడవకపోవడం తదితర కారణాలతో తల్లిదండ్రులు విద్యార్థులను రోజూ ఆటోలోనే పంపుతున్నారు. ఒకే ఆటోలో 30 మందికిపైగా విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. అధికారులు ఈ మార్గంలో విద్యార్థి బస్సుతో పాటు అదనపు బస్సులు తిప్పాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేద్దాం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

దేవనకొండ: కాకినాడలో జూలై 8, 9, 10వ తేదీల్లో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం దేవనకొండలో శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వం ఉండాలన్నారు. శిక్షణా తరగతులకు విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మధు, భాస్కర్, మండల నాయకులు సురేంద్ర, శశి, మహేష్, రాము పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

కృష్ణగిరి: జూలై 1న మండలంలోని అన్ని గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ శనివారం తెలిపారు. మండలంలోని 14 గ్రామ సచివాలయాలను 235 క్లస్టర్లుగా విభజించడం జరిగిందన్నారు. మండలంలోని అన్ని రకాల పింఛన్లకు సంబంధించి 4,849 మంది లబ్ధిదారులకు గాను రూ. 3,34,99,000లను కూడా డ్రా చేసినట్లు తెలిపారు. వీటిని సచివాలయ ఉద్యోగులు సోమవారం ఉదయం 6 నుంచే పంపిణీ చేస్తారని తెలిపారు. పెంచిన పింఛన్ రూ. 4వేలతో పాటు అదనంగా రూ.3 వేలు కలిపి రూ.7వేల ప్రకారం ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఘనంగా కాశిరెడ్డినాయన ఆలయ వార్షికోత్సవం


రాంపల్లిలో పూజలందుకున్న కాశిరెడ్డినాయన

తుగ్గలి : భక్తుల ఆరాధ్య దైవం సద్గురు కాశిరెడ్డినాయన 19వ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం రాంపల్లిలో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పంచమాంకములు నాటకం, గజ్జెలపూజ, చెక్కభజన, ఢీ పోటీలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాజీయే.. రాజమార్గం

ఆలూరు రూరల్: రాజీమార్గమే రాజమార్గమని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి ఎంఎస్ భారతి అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. క్షణికావేశంతో నేరాలకు పాల్పడి జైలు, కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా 31 కేసులను పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. బార్ అండ్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వాయుజీవోత్తమ రావు, షేక్షావలి, న్యాయవాదులు ప్రవీణ్, విజయ్ భాస్కర్, రాజేష్ నాయుడు, తిమ్మయ్య, ఆలూరు ఎస్ఐ ఓబులేష్ పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి భారతి

సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయి


పెండేకల్లులో అంకాలప్ప దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

తుగ్గలి : విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ విజయలక్ష్మి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సర్పంచ్ లీలావతి అన్నారు. పదవీ విరమణ పొందిన పంచాయతీ కార్యదర్శి అంకాలప్ప సన్మాన కార్యక్రమాన్ని శనివారం పెండేకల్లు పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతి ఉద్యగికి సహజమేనన్నారు. ఉద్యోగులు తమ బాధ్యతలను మర్చిపోకుండా విధులు నిర్వహిస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం అంకాలప్ప దంపతులను దుశ్శాలువ, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బసిరెడ్డి, సుధాకరరెడ్డి, విజయలక్ష్మి, మధుసూదనరెడ్డి, దివాకరరెడ్డి, నాగచంద్ర, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాగేష్ మృతి తీరని లోటు

మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెర గ్రామానికి చెందిన చాకలి నాగేష్ మరణం వైఎస్సార్‌సీపీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం నాగేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటమిని జీర్ణించుకోలేక ఈనెల 10వ తేదీ తీవ్ర అస్వస్థకు గురై చికిత్స పొందుతూ 17వ తేదీ మృతి చెందాడని కుటుంబసభ్యులు మాజీ ఎమ్మెల్యే వద్ద విలపించారు. 10 రోజులుగా నిత్యం పార్టీ గురించి ఆలోచిస్తూ మనోవేదనకు గురయ్యారన్నారు. అనంతరం నాగేష్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. అధైర్యపడొద్దని అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని భరోసానిచ్చారు. ఆమె వెంట ఎంపీపీ అనిత, నాయకులు శాంతన్న, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఆంజనేయులు, కాజావలి, కిట్టి ఉన్నారు.


నాగేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

హెచ్‌ఎంకు పదవీ విరమణ సన్మానం


బజారప్పను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దేవనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న బజారప్ప శనివారం పదవీ విరమణ పొందారు. ఆయన్ను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న లలితమ్మ

కృష్ణగిరి: అంగన్‌వాడీల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ డిమాండ్ చేశారు. వెల్దుర్తిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం ఆమె అంగన్‌వాడీలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస గౌరవ వేతనం కాకుండా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి రూ. 26వేలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఉన్న సంపూర్ణ పోషణ యాప్స్‌ను తొలగించాలి. మినీ సెంటర్లను అంగన్‌వాడీ మెయిన్ సెంటర్లుగా మార్చాలని, బాలింతలకు, గర్భిణులకు సంపూర్ణ కిట్ల స్థానంలో డ్రై ఫ్రూట్స్ ఇవ్వాలని, అలాగే పని భారం తగ్గించాలని కోరారు. అలాగే ఇన్స్యూరెన్స్, ఈఎస్ఐ, పెన్షన్ గ్రాడ్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హాయంలో సమ్మె చేస్తున్న సమయంలో అప్పుడు ప్రతి పక్షంలో ఉన్న చంద్రబాబు, పవన్‌కళ్యాన్, నారా లోకేష్ మా ప్రభుత్వం వస్తే మీ డిమాండ్లు నెరవేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈదమ్మ, లక్ష్మిదేవి, కార్యకర్తలు శాంత, వరలక్ష్మి, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకుడు

ఆలూరు: ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకుడిగా నిలవాలని.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని డిప్యూటీ ఈఓ వెంకటరమాణ రెడ్డి సూచించారు. ఆలూరు ఎల్లార్తి రోడ్డు సమీపంలోని ప్రభుత్వ బాలుర-1 హైస్కూల్ హెచ్‌ఎం వరప్రసాద్ పదవీ విరమణ కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించేలా చూడాలని సూచించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి

విద్యుత్ వృథాను అరికట్టండి


ఏరూరులో పగటి సమయంలో వెలుగుతున్న విద్యుత్ దీపాలు

చిప్పగిరి: మండలంలోని అనేక గ్రామాల్లో రాత్రి పూట వెలగాల్సిన విద్యుత్ దీపాలు పగటి సమయాల్లో కూడా వెలుగుతూ విద్యుత్ వృథా అవుతోంది. దీనిపై మండల ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో విద్యుత్ బకాయిలు ఉన్న ప్రజల ఇళ్ల దగ్గరికి వచ్చి వసూలు చేసే అధికారులకు విద్యుత్ వృథా అవుతుంటే కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

వెల్దుర్తిలో టీడీపీ నాయకుల ఘర్షణ

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలో శనివారం ఓ పని విషయంలో టీడీపీకి చెందిన ఇద్దరు మండలస్థాయి నాయకులు ఘర్షణకు దిగారు. స్థానిక బాలికల బీసీ హాస్టల్‌లో నీటి సమస్య ఉండటంతో మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ పంచాయతీ సెక్రటరీ ద్వారా జేసీబీతో నీటి కుళాయి కోసం బొమ్మన శంకర్‌రెడ్డికి చెందిన టీడీపీ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై గుంత తవ్విస్తున్నాడు. టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడ్ తన వర్గంతో వచ్చి ఎవరిని అడిగి పనులు చేస్తున్నారని పనులు నిలిపివేశారు. విషయం తెలుసుకున్న జ్ఞానేశ్వర్‌గౌడ్ తన వర్గంతో అక్కడికి చేరుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఇరువర్గాలు వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సునీల్‌కుమార్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ క్రమంలో ఒక వర్గానికి అనుకూలంగా మాట్లాడుతున్నారని ఓ విలేకరి ఎస్ఐని ప్రశ్నించగా అతనిపై చేయి చేసుకున్నాడు. దీంతో అతని సర్కిల్ కార్యాలయంలో సీఐకి ఎస్ఐపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

పత్తికొండటౌన్: రాజీ మార్గమే రాజ మార్గమని జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్. భారతి అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. జడ్జి ఎంఎస్ భారతి కక్షిదారులను విచారించి 81 కేసులను పరిష్కరించినట్లు క్లర్క్ రవణమ్మ తెలిపారు. ఇందులో 42 ఐపీసీ క్రిమినల్ కేసులు, 17 సివిల్ కేసులు, భరణం కేసులు-3, చెక్ బౌన్స్ కేసులు-9, ఈపీ కేసులు-10 ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు, సురేష్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.